సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
97053 47483
నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

రెండు కార్లు ఢీ



బోల్తా పడిన కారు

బీచ్‌రోడ్డు : అతి వేగంగా వస్తున్న రెండు కార్లు ఢీకొన్నాయి. మూడో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం అర్ధరాత్రి మద్దిలపాలెం నుంచి ఎన్‌ఏడీ వెళ్తున్న కారు, సీతమ్మధార నుంచి రామాటాకీస్ వైపు వెళ్తున్న మరో కారు సత్య జంక్షన్ సిగ్నల్ పాయింట్ వద్ద ఢీకున్నాయి. ఈ ప్రమాదంలో ఎవరికి ఎటువంటి గాయాలు కాలేదని తెలిపారు. కార్లు రెండు ధ్వంసమైనట్లు చెప్పారు. ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామన్నారు.

వీనులవిందుగా గాత్ర కచేరీ



కచేరీ నిర్వహిస్తున్న శారదా సుబ్రహ్మణ్యం

మద్దిలపాలెం: విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంగీత నృత్య నాటకోత్సవాల 5వ రోజు శారదా సుబ్రహ్మణ్యం గాత్ర కచేరీ వీనులవిందుగా సాగింది. వీఎండీఏ అధ్యక్ష, కార్యదర్శులు సత్యనారాయణరాజు, డాక్టర్ గుమ్ములూరి రాంబాబు, శారదా సుబ్రహ్మణ్యం గుమ్ములూరి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. చేశారు. వయొలిన్‌పై మావుడూరి శర్మ, మృదంగంపై జయ భాస్కర్, ఘటంపై ఎం.సూర్యప్రసాద్ సహకారం అందించారు.

అంతర్జాతీయ కవి సమ్మేళనానికి ఆహ్వానం



పిళ్లా వెంకట రమణమూర్తి

సీతంపేట: తానా అంతర్జాతీయ కవి సమ్మేళనానికి బీవీకే కళాశాలకు చెందిన రిటైర్డ్ సంస్కృత అధ్యాపకుడు పిళ్లా వెంకట రమణమూర్తిని ప్రత్యేక ఆహ్వానితుడిగా తానా సంస్థ ఆహ్వానించింది. కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకుని తెలంగాణ భాషా దినోత్సవం సందర్భంగా ఈ నెల 9న ఇంటర్‌నెట్ మాధ్యమంగా నిర్వహిస్తున్న అంతర్జాతీయ కవి సమ్మేళనంలో ఆయన పాల్గొంటారు. ప్రతిష్టాత్మక కార్యక్రమంలో స్థానం కల్పించినందుకు తానా అధ్యక్షుడు నిరంజన్ శృంగవరపు, తానా ప్రపంచ సాహిత్య వేది నిర్వాహకులు డాక్టర్ ప్రసాద్ తోటకూర, సమన్వయకర్త చిగురుమళ్ల శ్రీనివాస్‌లకు రమణమూర్తి ధన్యవాదాలు తెలిపారు.

ఫిషింగ్ హార్బర్‌లో ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు



హార్బర్‌లో పలు ప్రాంతాలను పరిశీలిస్తున్న ట్రాఫిక్ ఏసీపీ రాజీవ్‌కుమార్

మహారాణిపేట : ఫిషింగ్ హార్బర్‌లో ఉదయం వేళల్లో విపరీతమైన ట్రాఫిక్ రద్దీ కొనసాగుతోంది. ఉదయం 6 గంటల నుంచి 10 గంటల వరకు చేపల వేలం పాట వద్ద రద్దీ వల్ల గంటల తరబడి ట్రాఫిక్ నిలిచిపోతోంది. దీని వల్ల మత్స్యకారులతో పాటు బోటు యాజమానులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని రాష్ట్ర మరపడవల సంఘం అధ్యక్షుడు వాసుపల్లి జానకీరామ్ స్పందన ద్వారా ఇటీవల కలెక్టర్ మల్లికార్జున దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం ట్రాఫిక్ పోలీసులు హార్బర్‌లో పలు ప్రాంతాలను పరిశీలించారు. సమస్య పరిష్కారానికి అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ రాజీవ్‌కుమార్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ నియంత్రణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. చేపల వేలం కేంద్రం వద్ద ఎక్కువగా ఆటోలు నిలుపుదల చేయటం వల్ల ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. విశాఖపట్నం ఫిషరీస్ జాయింట్ డైరెక్టర్ సమన్వయంతో పూర్తి స్థాయిలో ట్రాఫిక్ నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని ఏసీపీ రాజీవ్ కుమార్ హామీ ఇచ్చారని అసోసియేషన్ అధ్యక్షుడు వాసుపల్లి జానకిరామ్ తెలిపారు.



ఏయూ గ్రంథాలయానికి

పూర్వ వైభవం

- విజ్ఞాన కేంద్రానికి ఆధునిక సొబగులు
- నాలుగు దశాబ్దాల అనంతరం పూర్తి స్థాయిలో మరమ్మతులు
- యుద్ధప్రాతిపదికన పనులు



కార్ పార్కింగ్ ప్రాంతం



టేబుళ్లకు మరమ్మతు చేస్తున్న సిబ్బంది



ఏయూ ప్రధాన గ్రంథాలయం

ఏయూక్యాంపస్: దశాబ్దాలుగా లక్షలాది మందికి విజ్ఞాన కేంద్రంగా భాసిల్లిన ఆంధ్ర విశ్వవిద్యాలయం గ్రంథాలయం పూర్వ వైభవాన్ని సంతరించుకోనుంది. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా కొంత శిథిలావస్థకు చేరుకున్న లైబ్రరీని పునరుద్ధరించేందుకు పాలకులు యుద్ధప్రాతిపదికన పనులు చేపడుతున్నారు. దాదాపు నాలుగు దశాబ్దాల తర్వాత ఏయూ డాక్టర్ వి.ఎస్.కృష్ణా గ్రంథాలయాన్ని పూర్తి స్థాయిలో మరమ్మతులు చేయడంతో పాటు విద్యార్థులకు ఉపయుక్తంగా అవసరమైన మౌలిక వసతులను అభివృద్ధి చేస్తున్నారు.

భవనానికి పునరుజ్జీవం

ప్రస్తుతం ఐదు అంతస్తుల్లో విస్తరించి ఉన్న భవనాన్ని పునాదుల నుంచి పై అంతస్తు వరకు బలోపేతం చేసేవిధంగా పూర్తి స్థాయిలో ఆధునీకరిస్తున్నారు. దీనిలో భాగంగా ముందుగా భవనం చుట్టూ ప్లింత్ ప్రొటెక్షన్ చేపడుతున్నారు. భవనం చుట్టూ సరైన డ్రైనేజీ వ్యవస్థ లేని కారణంగా వర్షపు నీరు భవనంలోకి చేరే పరిస్థితి నుంచి పూర్తిస్థాయిలో డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేసే దిశగా పనులు ప్రారంభించారు. భవనం ఎదురుగా ఉన్న పార్కింగ్ ప్రాంతానికి మరమ్మతులు చేయడం, కొత్తగా కార్ పార్కింగ్ ప్లేస్‌ను నిర్మించే పనులు పూర్తవుతున్నాయి. పార్కుల్లో మొక్కలకు పశువుల నుంచి రక్షణ కల్పించే విధంగా ఫెన్సింగ్ పనులు సమాంతరంగా జరుగుతున్నాయి. గతంలో భవనం చుట్టూ ఉన్న కిటికీలు, తలుపులు గాలికి విరిగిపోవడం, అద్దాలు పగిలిపోవడం జరిగేది. వీటిని పూర్తిస్థాయిలో మార్పు చేస్తున్నారు.

భవనం చుట్టూ ఉన్న సన్‌షేడ్స్ బాగా దెబ్బతిన్నాయి. కొన్ని చోట్ల విరిగిపోగా.. మరికొన్ని చోట్ల భారీగా మొక్కలు పెరిగిపోయాయి. వీటిని తొలగించి కొత్తవాటిని నిర్మించే పనులు ప్రారంభించారు. భవనం పై అంతస్తులో రూఫ్ ట్రీట్‌మెంట్‌కు, అధునాతన కెమికల్ టెక్నాలజీతో పనులు చేస్తున్నారు.

ఏసీ రీడింగ్ రూమ్‌గా సెల్లార్ హాల్

భవనం సెల్లార్‌లో సుమారు ఐదు వేల చదరపు అడుగుల విస్తీర్ణం కలిగిన హాల్ దశాబ్దాలుగా నిరుపయోగంగా ఉంది. దీనిని గుర్తించిన అధికారులు పూర్తిస్థాయిలో దీని రూపురేఖలు మార్చేస్తున్నారు. దీనిలో సివిల్ సర్వీసెస్‌కి సిద్ధమయ్యే విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఒక ఏసీ రీడింగ్ రూమ్ ఏర్పాటు చేస్తున్నారు. ప్రత్యేకంగా ఒక ప్రవేశ మార్గాన్ని సైతం ఏర్పాటు చేస్తున్నారు. ప్రధాన గ్రంథాలయంతో సంబంధం లేకుండా విద్యార్థులు వచ్చి ఇక్కడ చదువుకునే విధంగా వసతులను కల్పిస్తున్నారు. భవిష్యత్తులో వర్సిటీ నుంచి పెద్ద సంఖ్యలో విద్యార్థులు యూపీఎస్సీ, ఏపీపీఎస్సీ నిర్వహించే పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి ప్రభుత్వ రంగంలో ఉన్నత స్థానాలలో స్థిరపడటానికి ఇది దోహదం చేస్తుంది.

- గ్రంథాలయ భవనం వెనుకభాగంలో నిరుపయోగంగా ఉన్న భవనం పైకప్పును తొలగించి, కొత్తగా పైకప్పు నిర్మించి, అధునాతన టాయిలెట్స్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

టేకు ఫర్నిచర్‌కు న్యూ లుక్

లైబ్రరీలో దశాబ్దాల క్రితం తయారు చేసిన టేకు ఫర్నిచర్‌కు న్యూ లుక్ తీసుకువస్తున్నారు. విద్యార్థులు చదువుకునే టేబుల్స్, బుక్ షెల్ఫ్‌లకు దశాబ్దాలుగా పాలిషింగ్, పెయింటింగ్ చేయలేదు. ఇప్పుడు కొత్త వాటిలా మెరిసే విధంగా పాలిష్ చేస్తున్నారు. పుస్తకాలు ఉంచే షెల్ఫ్‌లకు విభాగాల వారీగా పెయింటింగ్ పనులు జరుగుతున్నాయి. అవసరమై ప్రాంతాల్లో ఉడ్ వర్క్, డెస్క్‌లు నిర్మించడం, టేబుల్స్‌కు మరమ్మతులు శరవేగంగా జరుగుతున్నాయి. నెల రోజుల్లో గ్రంథాలయాన్ని మరింత శోభాయమానంగా తీర్చిదిద్దే విధంగా ప్రణాళికాబద్ధంగా అన్ని పనులు చేస్తున్నారు.

పూర్తిస్థాయిలో అభివృద్ధి



విశ్వవిద్యాలయానికి వచ్చే ప్రతీ విద్యార్థి ప్రగతిని ప్రభావితం చేసే అంశాల్లో గ్రంథాలయం ఒకటి. దీనిని దృష్టిలో ఉంచుకుని నేటి తరం విద్యార్థులను గ్రంథాలయాల బాట పట్టించే విధంగా అధికారులు పని చేస్తున్నారు. దీనిలో భాగంగా ప్రధాన గ్రంథాలయాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తున్నారు. దశాబ్దాలుగా జరగని అభివృద్ధిని ప్రస్తుతం ఇక్కడ కార్యరూపంలో చూపుతున్నారు.

– ఆచార్య పి.వెంకటేశ్వర్లు, లైబ్రేరియన్, డాక్టర్ వి.ఎస్.కృష్ణా గ్రంథాలయం

ఎంపీ ఎంవీవీకి అభినందన



ఎంపీ ఎంవీవీని సత్కరిస్తున్న డొక్కర ప్రసాద్

ఎంవీపీకాలనీ : విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణను వైఎస్సార్‌సీపీ నాయకుడు, తూర్పు నియోజకవర్గ పరిరక్షణ సమితి అధ్యక్షుడు డొక్కర ప్రసాద్ సత్కరించారు. ఆయన తూర్పు నియోజకవర్గ సమన్వయకర్తగా నియమితులైన సందర్భాన్ని పురస్కరించుకుని లాసన్స్ బే కాలనీలోని పార్టీ కార్యాలయంలో ఆయన్ని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలకు అనుగుణంగా 2024 ఎన్నికల్లో తూర్పులో పార్టీ గెలుపే లక్ష్యంగా కృషి చేస్తామన్నారు. నియోజకవర్గంలో బలమైన నాయకత్వానికి బాటలు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు తూర్పు నియోజకవర్గ పరిరక్షణ సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.

కాల్వల నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎంపీ ఎంవీవీ, మేయర్ హరి వెంకటకుమారి

ఆరిలోవ: జీవీఎంసీ 12వ వార్డు పరిధి దుర్గానగర్‌లో కాల్వల నిర్మాణ పనులు బుధవారం ప్రారంభమయ్యాయి. విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ, నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, స్థానిక కార్పొరేటర్ అక్కరమాని రోహిణితో కలసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీ, మేయర్ మాట్లాడుతూ సుమారు రూ.15 లక్షలతో సీసీ డ్రైనేజీ పనులు జరుగుతున్నాయని తెలిపారు. పనులు నాణ్యతతో చేపట్టాలని, త్వరితగతిన పూర్తి చేయాలని జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. అన్ని వార్డుల్లో ప్రజా అవసరాలకు అనుగుణంగా సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. విశాఖ నగరాన్ని మరింత అభివృద్ధి చేయాలనే ఆలోచనతో ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్ మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ కార్యనిర్వాహక ఇంజినీర్ సుధాకర్, సిబ్బంది, వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఊటగెడ్డ పార్కు ప్రారంభం



మాట్లాడుతున్న మేయర్ గొలగాని హరివెంకటకుమారి

బీచ్‌రోడ్డు : జీవీఎంసీ 28వ వార్డులోని ఊటగెడ్డ పార్కును బుధవారం నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, ఎంపీ, తూర్పు నియోజకవర్గం సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుమారు రు.3.45 కోట్ల వ్యయంతో పార్కును అభివృద్ధి చేశామన్నారు. నగరానికి సువిశాలమైన తీర ప్రాంతం ఉందని, ఎంతో మంది పర్యాటకులు నగరానికి వస్తారని వారందరికీ ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం, సీఎం జగన్మోహన్‌రెడ్డి అనేక పార్కులను అభివృద్ధి చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వాహక ఇంజనీరు సుధాకర్, వార్డు కార్పొరేటర్ పల్లా అప్పలకొండ తదితరులు పాల్గొన్నారు.

పోషకాహార వంటల పోటీలు



వంటలను పరిశీలిస్తున్న వైద్యురాలు కిరణ్‌లలిత

ఆరిలోవ : జీవీఎంసీ 11వ వార్డు గాంధీనగర్‌లో బుధవారం పోషకాహార వంటల పోటీలు నిర్వహించారు. మేజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో న్యూట్రీషియన్ వారోత్సవాల్లో భాగంగా జరిగిన ఈ పోటీల్లో పలువురు మహిళలు పాల్గొని వివిధ రకాల వంటలు తయారు చేసి ప్రదర్శించారు. బాలాజీనగర్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ (యూపీహెచ్‌సీ) వైద్యురాలు డాక్టర్ కిరణ్ లలితాదేవి పాల్గొని వంటకాలు పరిశీలించారు. రుచికరంగా వంటలు చేసిన వారికి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోషక విలువలతో కూడిన ఆహారం తినడం వల్ల చక్కటి ఆరోగ్యం చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో మేజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ సభ్యులు సౌజన్య, శంకర్, సాయి, రేవతి, గౌతమి, స్వాతి, యూపీహెచ్‌సీ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఫణీంద్రను తల్లికి అప్పగించిన రెడ్‌క్రాస్ సొసైటీ



ఫణీంద్రను తల్లి మల్లేశ్వరికి అప్పగిస్తున్న రెడ్‌క్రాస్ ప్రతినిధులు

ఎంవీపీకాలనీ : పల్నాడు జిల్లా కారంపూడికి చెందిన ఫణీంద్ర (22) అనే యువకుడిని రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు త్రీటౌన్ పోలీసుల సమక్షంలో అతని తల్లి, కుటుంబ సభ్యులకు అప్పగించారు. బీటెక్ చదువుతున్న ఫణీంద్రను తల్లి కళాశాలకు సరిగ్గా వెళ్లడం లేదని మందలించింది. దీంతో కోపానికి గురైన అతను ఇంట్లో నుంచి పారిపోయి వచ్చి విశాఖ చేరుకున్నాడు. ఈ నెల 2వ తేదీ రాత్రి నైట్ పెట్రోలింగ్ చేస్తున్న త్రీటౌన్ ఎస్‌ఐ రాముతో పాటు సిబ్బందికి బీచ్‌రోడ్డులో కనిపించాడు. వివరాలు అడగ్గా సరైన సమాధానం ఇవ్వలేదు. ఎదైనా అఘాయిత్యం చేసుకుంటాడనే అనుమానంతో పోలీసులు ఫణీంద్రను త్రీటౌన్ పోలీసు స్టేషన్‌కు తరలించి అనంతరం పెదవాల్తేర్‌లోని రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులకు అప్పగించారు. అతన్నుంచి వివరాలు సేకరించిన రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు అతని తల్లి మల్లేశ్వరితో పాటు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పోలీసుల సమక్షంలో బుధవారం అతన్ని తల్లి మల్లేశ్వరికి అప్పగించారు.

రేపు ఉచిత సామూహిక శ్రావణలక్ష్మి పూజలు



సిరులతల్లికి అభిషేకం చేస్తున్న భక్తులు

డాబాగార్డెన్స్: శ్రావణ మాసోత్సవాల్లో భాగంగా బురుజుపేట కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 8న ఉచిత సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు అమ్మవారి దేవస్థానం కార్యాలయంలో సంప్రదించి దరఖాస్తులు పూరించి గురువారంలోగా అందజేయాలి.

నేడు సహస్ర తులసీదళార్చన..

కనకమహాలక్ష్మి దేవాలయంలో ప్రతి గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసీ దళార్చన నిర్వహించనున్నారు. రూ.1,500 పూజా రుసుం చెల్లించి భక్తులు పాల్గొనవచ్చు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబర్ 060810011006691, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తుల వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా 89855 15989 నంబర్‌కు వాట్సాప్ చేయాలి.

21వ రోజుకు శ్రావణలక్ష్మి పూజలు..

కనకమహాలక్ష్మి ఆలయంలో శ్రావణ మాసం సందర్భంగా నిర్వహిస్తున్న శ్రీలక్ష్మి పూజలు బుధవారం నాటికి 21వ రోజుకు చేరాయి. పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. సిరులతల్లికి భక్తులు విశేష అభిషేకాలు చేశారు. ఈ పూజల్లో పాల్గొనదలిచే భక్తులు రూ.400 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని ఆలయ ఈవో కె.శిరీష తెలిపారు. వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ, ఆలయ సిబ్బంది, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

వెండి కిరీటాలు, ఆభరణాల బహూకరణ

సింహాచలం: జీవీఎంసీ 95వవార్డు పాపయ్యరాజుపాలెం ఆర్టీసీ లేఅవుట్‌లోని ఉమారామలింగేశ్వరస్వామి ఆలయంలో కొలువుదీరిన వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి దాతలు సమకూర్చిన వెండి కిరీటాలు, ఆభరణాలను బుధవారం కార్పొరేటర్ ముమ్మన దేముడు చేతులమీదుగా అందజేశారు. పాపయ్యరాజుపాలేనికి చెందిన దాతలు జి.సంగమేశ్వరరావు, రామారావు, దూర్వాసులు, రవి ప్రసాద్, కృష్ణారావు, శేఖర్, నాగమణి, మోహనరావు, రామ ప్రసాద్ రూ. లక్షతో స్వామికి వెండి కిరీటాలు, ఆభరణాలు చేయించారు. ఆలయంలో స్వామి, అమ్మవార్లకు వాటిని అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడు చిప్పల చందు, కె.సంతోష్, ఆలయ కమిటీ సభ్యులు కేవీఆర్.లక్ష్మి, భీమారావు, రామసూరి, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

యశోద తనయా.. మము బ్రోవుమయా..

- ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి
- నందడి చేసిన బాల కృష్ణుడు, గోపికల వేషధారులు



పాత ఆరిలోవలో కృష్ణాష్టమి ఉత్సవాల్లో పూజలు చేస్తున్న మేయర్ హరి వెంకటకుమారి



ముడసర్లోవ పార్కులో కృష్ణాష్టమి ఉత్సవాల్లో పూజ చేస్తున్న ఎంపీ ఎంవీవీ, మేయర్ హరి వెంకటకుమారి



తోటగరువులో జరిగిన కృష్ణాష్టమి ఉత్సవాలలో ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్



కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న ఏయూ వీసీ ప్రసాదరెడ్డి



పెదగదిలిలో కృష్ణాష్టమి ఉత్సవాలలో అలరించిన శ్రీకృష్ణుడి వేషధారణ



గోపాలుడికి చిన్నారుల ఊయల సేవ

ఆరిలోవ : శ్రీకృష్ణ జన్మాష్టమి ఉత్సవాలు ఆరిలోవలో బుధవారం ఘనంగా జరిగాయి. పాత ఆరిలోవ, తోటగరువు, పెదగదిలి, చినగదిలి, దీన్‌దయాళ్‌పురం, ముడసర్లోవ ప్రాంతాల్లోని యాదవ సంఘాల ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు నిర్వహించారు. జీవీఎంసీ పదకొండో వార్డు పరిధి పాత ఆరిలోవలో యశోద బాల గోపాల సంఘం ఆధ్వర్యంలో ప్రారంభించిన ఉత్సవాలలో నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి పాల్గొని స్వామికి పూజలు చేశారు. జీవీఎంసీ పదమూడో వార్డు పరిధి ముడసర్లోవ పార్కులో జరిగిన ఉత్సవాలలో విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ, నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, స్థానిక కార్పొరేటర్ కెల్ల సునీత పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు వారికి ఘన స్వాగతం పలికి వారిచే స్వామికి ప్రత్యేక పూజలు చేయించారు. ఆయా కార్యక్రమాలలో వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులు, ఉత్సవాల నిర్వాహకులు పాల్గొన్నారు.

తోటగరువు, పెదగదిలిలో..

ఆరిలోవ : ఆరిలోవ పరిధి తోటగరువులో మురళీకృష్ణ యాదవసేవా సంఘం ఆధ్వర్యంలో జరిగిన కృష్ణాష్టమి ఉత్సవాలలో ఎమ్మెల్సీ సీహెచ్ వంశీకృష్ణ శ్రీనివాస్ పాల్గొన్నారు. ఆయన ఇక్కడ స్వామికి పూజలు చేశారు. కృష్ణుడు, యశోద తదితర వేషధారణలో ఉన్న చిన్నారులతో కొంతసేపు ఆయన సరదాగా గడిపారు. పెదగదిలిలోని శ్రీకృష్ణ యువసజన సేవా సంఘం ఆధ్వర్యంలో బుధవారం శ్రీకృష్ణాష్టమి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ ఉత్సవాలలో చిన్నారులు కృష్ణుడి వేషధారణలో అలరించారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు గొలగాని శ్రీనివాస్ తదితరులు పాల్గొని స్వామికి పూజలు చేశారు.

బీజేపీ కార్యాలయంలో..

ఎంవీపీకాలనీ : లాసన్స్ బే కాలనీలోని బీజేపీ నగర కార్యాలయంలో బుధవారం సాయంత్రం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావుతో పాటు ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణుకుమార్‌రాజు పాల్గొని చిన్నారులతో కలిసి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జీవీఎల్ మాట్లాడుతూ హిందువులు అత్యంత ఉత్సాహంగా జరుపుకునే వేడుకగా కృష్ణాష్టమి నిలుస్తుందన్నారు. అనంతరం చిన్నారులకు బహుమతులు అందజేశారు. పార్టీ విశాఖ పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర, సురేంద్ర, ప్రకాష్‌రెడ్డి, కేశవకాంత్ పాల్గొన్నారు.

నవంబర్ 14 నుంచి మహా నారాయణ సేవ

భీమునిపట్నం: భీమిలి బీచ్ సమీపంలోని వీరాంజనేయ అయ్యప్ప సేవా సంఘం ఆధ్వర్యంలో నవంబర్ 14 నుంచి మహా నారాయణ సేవ ప్రారంభించడానికి నిర్ణయించారు. ఈ మేరకు బుధవారం సంఘ సభ్యుల సమావేశం అధ్యక్షుడు కొమ్మినేని ఎర్నినాయుడు అధ్యక్షతన నిర్వహించారు. ఇక్కడ ఏటా అయ్యప్ప, భవానీ మాలధారులతోపాటు ఇతర మాలధారులకు మహా నారాయణ సేవ ఏర్పాటు చేస్తున్నారు. ఈ ఏడాది కూడా నవంబర్ 14 నుంచి డిసెంబర్ 28 వరకు అన్న ప్రసాదం అందించడానికి నిర్ణయించి కరపత్రాలు ఆవిష్కరించారు.

ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్‌కు సహకరిస్తాం



మేయర్ హరి వెంకటకుమారిని సత్కరిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

అల్లిపురం: ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్‌కు తమ వంతు సహకారం ఎల్లప్పుడు ఉంటుందని నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అన్నారు. కొన్ని స్కూల్స్ మూతపడుతున్న సమయంలో అసోసియేషన్ చేసిన సేవలు తాను తెలుసుకున్నానని తెలిపారు. ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఉపాధ్యాయ దినోత్సవంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె ఉపాధ్యాయులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డీఈవో ఎల్.చంద్రకళ, మిడ్ డే మీల్స్ అడిషనల్ డైరెక్టర్ సుబ్బారెడ్డి, అసోసియేషన్ అధ్యక్షుడు కేఎస్ మూర్తి, రాజీవ్ విద్యా మిషన్ ప్రతినిధి బి.శ్రీనివాస్ పాల్గొని సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొణతాల శ్రీనివాస్, కోశాధికారి మూర్తి, రాష్ట్ర నాయకులు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

